స్లో పాయిజన్

జొన్నలగడ్డ రామలక్ష్మి

"మీరు రాత్రి రెండింటికి ఇంటికొచ్చారు—" అంది శైలజ.

"టైము చూడలేదు. కానీ ఆలస్యంగా వచ్చానని తెలుసు—" అన్నాడు ముత్యాలరావు అలక్ష్యంగా.

"ఆలస్యం ఎందుకయింది?"

"క్లబ్బులో పేకాడుతున్నాను. స్నేహితుల బలవంతంమీద చాలాసేపుండిపోయాను. టైము తెలియలేదు—"

"మీరు క్లబ్బునుంచి రాత్రి పదింటికే బయల్దేరారు" అంది శైలజ తాపీగా.

ముత్యాలరావు తడబడుతూ—"ఏమో—నేను టైము చూడలేదు—" అన్నాడు.

"టైము చూసినా చూడకపోయినా క్లబ్బునుంచి ఇంటికి రావడానికి పావుగంట చాలు. కానీ మీకు నాలుగు గంటలు పట్టింది—" అంది శైలజ.

"అయితే ఏమంటావ్?"

"మీరు రీటా యింటినుంచి మనింటికి వచ్చారని నాకు తెలుసు—"

ముత్యాలరావు కంగారుగా — "రీటా యెవరు?" అన్నాడు.

"క్లబ్బునుంచి మనింటికి రావడానికి నాలుగ్గంటలు పట్టడానికి కారణమేమిటీ అని ఆలోచించండి. రీటా ఎవరో గుర్తు వస్తుంది—"

"నువ్వు నామీద డిటెక్టివుల్ని నియమిస్తున్నావా?"

"రీటా ఎవరో గుర్తొచ్చిందా?" అంది శైలజ.

"ఇంతకీ నీ ఉద్దేశ్య మేమిటి?" అన్నాడు ముత్యాలరావు.

"ఇంకా అర్థం కాలేదా?" అంది శైలజ.

భార్యాభర్తలిద్దరూ ఒకరివంక ఒకరు చూసుకున్నారు. ఎన్నికల్లో ప్రత్యర్థులు అనుకోకుండా ఒకరికొకరు ఎదురుపడితే బహుశా అలాగే చూసుకుంటారేమో!

"అర్థంకాలేదు—" అన్నాడు ముత్యాలరావు.

"అర్థమయ్యేలా చెప్పమంటారా?" అంది శైలజ.

"వద్దు—" అన్నాడు ముత్యాలరావు.

"నా మనసులోని మాటను క్లుప్తంగా ఒక్క మాటలో అదీ రెండక్షరాల్లో చెప్పారు. చాలా థాంక్స్!" అంది శైలజ.

"ఏమన్నావ్?"

"మీరు క్లబ్బుకు వెళ్ళవద్దు రీటా దగ్గరకు వెళ్ళవద్దు. వద్దు అంటే అర్థమిదే!" అంది శైలజ.

"ఎందుకని వెళ్ళకూడదు?"

"ఎందుకు వెళ్ళాలి?"

ముత్యాలరావు అదోలా ఆమెవంక చూసి—"ముందు నా ప్రశ్నకు జవాబు చెప్పు. తర్వాత నీ ప్రశ్న సంగతి ఆలోచిస్తాను—" అన్నాడు.

"మీరు ఆఫీసునుంచి ఎప్పుడు వస్తారా అని నేను ఎదురు చూస్తూంటాను. నాకోసం మీరు తిన్నగా ఇంటికి రావాలి. మనం కలిసి తిరగాలి. కష్టసుఖాలన్నీ కలిసి అనుభవించాలి—" అంది శైలజ.

"కష్టాలన్నీ నేను ఎప్పుడో అనుభవించేశాను. నాకు సుఖాలమీదనే మోజు—...."

"పోనీ మనిద్దరం ఎప్పుడూ కలిసివుంటే—అదే సుఖం కాదా!"

"నేను సుఖాలను వెతుక్కుంటున్నాను. నీ నుంచి దూరంగా పోవడంలో నాకు సుఖం కనబడుతోంది. క్లబ్బులో సుఖం కనబడుతోంది. రీటాలో సుఖం కనబడుతోంది—...." తెగించి అన్నాడు ముత్యాలరావు.

"ఈ విషయం మీరు నాకు పెళ్ళికిముందు చెప్పలేదు—"

"పెళ్ళికి ముందు ఈ విషయం నాకు తెలియదు .. "

"నాలో సుఖం ఎందుకు కనిపించదు మీకు?" అంది శైలజ.

"అది నేనేం చెప్పగలను?"

"నేను మీ జీవితానికో అర్థాన్నిచ్చాను...."

"అర్థం అంటే డబ్బు అయితే నీ మాట నిజమే!"

శైలజ క్రూరంగా అతడివంక చూసింది—"పెళ్ళికి ముందు ఎన్ని కలలు కన్నాను? అయిన వాళ్ళందరినీ ఎదిరించి ఒప్పించి మిమ్మల్ని చేసుకున్నాను. చివరికిలాగ

యింది—"

"పెళ్ళయ్యాక బయట సుఖాలను వెతుక్కోవడం మగవాడికి సహజం. క్లబ్బులో నా స్నేహితులందరూ ఇదే పని చేస్తున్నారు...."

"అందుకే మిమ్మల్ని క్లబ్బుకి వెళ్ళొద్దంటున్నాను..."

"నేను వెడతాను...."

"వీల్లేదు...."

"నువ్వెవరు నన్ను శాసించడానికి?"

"కట్టుకున్న భార్యను. ఈ రోజునుంచీ మీరు నేను గీచిన గీటు దాటడానికి వీల్లేదు...."

"దాటడం సంగతి అటుంచు. నిన్నసలు గీత గియ్యనివ్వను...."

"అయితే ఏం జరుగుతుందో తెలుసా?"

"నీ బెదిరింపులకు నేను లొంగను...."

"నేను లొంగదియ్యగలను మిమ్మల్ని...."

ఉన్నట్లుండి ముత్యాలరావు అదోలా నవ్వాడు. అతడు నడుస్తున్న వీధి గుమ్మంలోకి వచ్చాడు. అలా దారిన పోతున్న ముష్టివాడొకడు కనిపించాడు. "ఒరేయ్— ఇలా రా!" అని ముత్యాలరావు వాణ్ని పిలిచాడు.

వాడు వెంటనే గుమ్మంలోకి వచ్చాడు. వాడి కళ్ళలో ఆశ మెరుస్తోంది.

ఆ ముష్టివాడి వయసు పాతికేళ్ళకు మించదు. మనిషి దృఢంగానే ఉన్నాడు. రంగు మరీ అంత నలుపు కాదు. గెడ్డం బాగా మాసి వుంది. కళ్ళు లోతుకుపోయి ఉన్నాయి. ఆ కళ్ళలో ఆకలి....

ముత్యాలరావు జేబులోంచి ఓ రూపాయినోటు తీశాడు.

ముష్టివాడు ఆశగా చేతులు చాపాడు.

ముత్యాల్రావు వాడికా నోటు అందించాడు. ముష్టి వాడికి కలిగిన ఆనందమింతా అంతా కాదు. తనకు చేత నైనంతగా ముత్యాల్రావును పొగిడి వెనక్కు తిరిగాడు వాడు.

అప్పుడు ముత్యాల్రావు వాడిని ఫెడీమని తన్నాడు.

అనుకోకుండా దెబ్బ తగలడంవల్ల ముష్టివాడు బోర్లా ముందుకు పడిపోయాడు. వాడు మళ్ళీ లేవడానికి కొద్ది క్షణాలు పట్టింది.

"ఏంటి బాబూ ఇది!" అన్నాడు వాడు.

ముత్యాల్రావు వాణ్ని సమీపించాడు. ముష్టివాడు భయంగా తన చేతిలోని రూపాయినోటును గట్టిగా పట్టుకుని — "ఇచ్చిన డబ్బు వెనక్కు తీసుకోడం అన్యాయం బాబూ!" అన్నాడు.

ముత్యాల్రావు నవ్వి — "నేను డబ్బు తీసుకుందుకు రాలేదు. నేను నిన్ను అకారణంగా తన్నాను కదా— అందుకు నీకు కోపం వచ్చిందో లేదో తెలుసుకుందామని!" అన్నాడు.

"ముష్టి వెధవని—నాకోపమేమిటి బాబూ!" అన్నాడు వాడు.

"అయితే రోజూ ఇదే టైముకి ఇక్కడకు రా! ఓ రూపాయిచ్చి ఓ తాపు తంతుంటాను—" అన్నాడు ముత్యాల్రావు.

ముష్టివాడు చటుక్కున అతడి పాదాలమీద వాలి— "తప్పకుండా వస్తా బాబూ!" అన్నాడు.

ముత్యాల్రావు వెనక్కు తిరిగాడు. గుమ్మంలో నిలబడి శైలజ ఇదంతా చూస్తోంది. అతడామెను సమీపించి—

"అర్థమయిందా?" అనడిగాడు.

"ఏమిటి?" అంది శైలజ.

"నీ భర్త నువ్వు గీచిన గీటు దాటకూడదనుకుంటే— అదిగో ఆ వెళ్ళిపోతున్నాడే—అలాంటి వాణ్ని పెళ్ళా డాల్సింది నువ్వు...." అన్నాడతను.

శైలజ కళ్ళు ఎర్రబడ్డాయి. ఆమె చటుక్కున చప్పట్లు కొట్టి ఆ ముష్టివాణ్ని పిలిచింది. వాడు భయం గానే వెనక్కి వచ్చాడు.

"పదకొండింటికి రా—అన్నం పెడతాను—" అన్నా దామె.

ముష్టివాడి మొఖం సంతోషంతో వెలిగిపోయింది.

ముత్యాలరావు కామె మాటలు అర్థమయినట్లు లేదు. అర్థం చేసుకోవాలని ప్రయత్నించనూ లేదు. అయితే అతడికి కోపం మాత్రం వచ్చింది.

2

"ఈ రోజు మా ఆవిడతో పోట్లాడాను—"

"ఇన్నాళ్ళ తర్వాత ఇప్పుడా?" అన్నది రీటా.

"అంటే?"

"మీరు నా వద్దకు రావడం ప్రారంభించి రెండు నెలలు దాటింది. పోట్లాట ఎప్పుడో రావలసింది—...." అంది రీటా.

"మిగతావాళ్ళకూ నాకూ చాలా తేడా వుందిగా.." అన్నాడు ముత్యాలరావు గర్వంగా. అతడి అభిప్రా యంలో రీటా వద్దకు వచ్చే మిగతావాళ్ళు రహస్యాలను దాచిపెట్టలేరు.

"వాళ్ళకూ మీకూ మరో తేడా కూడా ఉంది!"

"చెప్పు...."

"నా దగ్గర వచ్చేవాళ్ళు కొంతమంది బ్రహ్మచారులు. పెళ్ళికి ముందు మీరు నా దగ్గర రాలేదు. అదొక తేడా! పెళ్ళయిన వాళ్ళెవ్వరూ పెళ్ళయిన ఒకటి రెండేళ్ళ దాకా నా దగ్గర రాలేదు. మీరైతే పెళ్ళయి ఆర్నెల్లయినా తిరక్కుండా...."

"ఇంకా ఏమైనా తేడాలుంటే చెప్పు...." అన్నాడు ముత్యాలరావు.

"చెప్పను—" అంది రీటా.

"ఎందుకని?" అన్నాడు ముత్యాలరావు.

"అది నా వృత్తి రహస్యం—" అని రీటా నవ్వి—"కానీ ఒక్క విషయం చెప్పగలను. నా దగ్గర వచ్చే వాళ్ళందరిలోనూ మీరంటేనే నాకు ఎక్కువ ఇష్టం—" అంది.

"ఈ పొగడ్త కూడా నీ వృత్తికి సంబంధించినదేనా?"

రీటా నవ్వి—"మీరెలాగనుకున్నా నాకు అభ్యంతరం లేదు. నా మనసులోని మాట చెప్పాను—" అంది.

ఉన్నట్లుండి ముత్యాలరావు టైము చూసుకుని—"అబ్బా—అప్పుడే ఒంటి గంటయింది—" అన్నాడు.

"అప్పుడే ఒంటి గంటయిందా—మనిద్దరం ఒకచోట ఉన్నామంటే టైము తెలియదు...." అంది రీటా.

ముత్యాలరావు లేచాడు.

"ఇంటికి వెళ్ళగానే పోట్లాట తప్పదేమో!" అంది రీటా మళ్ళీ.

"పోట్లాటా—మరోటా? పక్కన పేనులా పడుం టుంది. అది పెళ్ళాం. నేను మొగుణ్ణి—" అన్నాడు ముత్యాలరావు.

"నేను ఎవరికీ పెళ్ళాన్ని కాకపోవడం నా అదృష్ట మనిపిస్తోంది మీ మాటలు వింటూంటే—" అంది రీటా.

"అసలీ లోకంలోని ఆడవాళ్ళంతా నీవలాగే ఉండి పెళ్ళాలన్నవాళ్ళు లేకుండా ఉంటే ఇంకా చాలా బాగుండేదని నాకు అనిపిస్తుంది—" అన్నాడు ముత్యాల్రావు. తన కోరిక తీరేది కాదన్న దిగులు కూడా అతడి కళ్ళలో కనబడుతోంది.

"ఈ విషయమై మీ భార్య అభిప్రాయం కూడా అడిగి తెలుసుకోండి—" అంది రీటా.

ముత్యాల్రావు అదోలా నవ్వాడు. ఆ నవ్వులోనే ఆ యిల్లు వదిలాడతను. సరిగ్గా పావుగంటలో ఇల్లు చేరాడతను.

ఆ రోజు ఆశ్చర్యం....

రోజూ అయితే అతడు కాలింగ్ బెల్ మ్రోగించాల్సి వచ్చేది. ఆ రోజు తలుపులు తెరిచే ఉన్నాయి.

అతడు గుమ్మంలో అడుగు పెట్టగానే సోఫాలో కూర్చుని ఉన్న శైలజ కనబడింది. ఆమెకు ఎదురుగా ఓ యువకుడు కూర్చుని ఉన్నాడు. ఇద్దరి చేతుల్లోనూ పేకముక్కలున్నాయి.

ఎవరా యువకుడు? అన్నది ముత్యాల్రావు మెదడులో మొదటిసారిగా మెదలిన ప్రశ్న!

ఆ యువకుడి ముఖం అతడికి స్పష్టంగా కనబడుతున్నది. ఇంట్లో ఆ గదిలో ట్యూబ్ లైట్ ప్రకాశం పగలును మరిపించేలాగుంది.

అడుగుల చప్పుడు విని శైలజ చటుక్కున లేచి నిలబడి—"అరే—వచ్చేశారే—" అంది.

ముత్యాల్రావు మాట్లాడలేదు. ఆమె వంకా ఆ యువకుడి వంకా ఓసారి మార్చి మార్చి చూశాడు.

"ఆరే—మరిచేపోయాను — మీట్ మై ఫ్రెండ్ కిషోర్!" అంది శైలజ.

ఆ యువకుడు పేకముక్కలు బల్లమీద పడేసి—"నమస్తే!" అన్నాడు. ముత్యాల్రావు కూడా అప్రయత్నంగా రెండు చేతులూ జోడించి — "నమస్తే!" అన్నాడు.

"కిషోర్ —నువ్వింక వెళ్ళవచ్చు. మళ్ళీ రేపు రాత్రి పదింటికిరా—" అంది శైలజ. అతడు చకచకా నడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

ఆ యువకుడు తనకంటె అందంగా వున్నాడు. తనకంటె బలంగా ఉన్నాడు. తనకంటె ఆకర్షణీయంగా ఉన్నాడు. తనకంటె చలాకీగా ఉన్నాడు. అన్నింటికీ మించి తను లేనప్పుడు ఇంట్లో వున్నాడు. తను రాగానే వెళ్ళిపోయాడు.

"అలా అనుమానంగా చూడకండి. వచ్చినప్పట్నించీ కిషోర్ ఆ సోఫాలోనే ఉన్నాడు. వీధి తలుపులు అలా తీసే ఉన్నాయి. మీరు చెడిపోతున్నారని నేనూ చెడిపోవడం నా అభిమతం కాదు...." అంది శైలజ.

"ఎవరా కిషోర్?" అన్నాడు ముత్యాల్రావు.

"ఈ ప్రశ్నకు నేను చెప్పే జవాబు మీకు నచ్చదు. అసలు కిషోర్ని పావు తక్కువ రెండుకల్లా పంపించేద్దామనుకున్నాను. మీరు రెండింటికి వస్తారు కదా మీ కళ్ళబడదు అనుకున్నాను. కానీ మీరు పెందరాళే వచ్చేశారు. రేపు కూడా ఇలాగే ఒంటిగంటం పావుకు వచ్చే మాటయితే ముందే చెప్పండి. కిషోర్ని కాస్త

ముందుగా నే పంపించివేస్తాను...." అంది శైలజ.

"వాడు రేపు కూడా వస్తాడా-ఎందుకు?" అన్నాడు ముత్యాలరావు.

"నా ఒక్కర్తికీ ఇంట్లో తోచడం లేదు. కాలక్షేపం కోసం అతన్ని రమ్మన్నాను—...." అంది శైలజ.

"తెగించావా?" అన్నాడు ముత్యాలరావు.

శైలజ మాట్లాడలేదు.

"మాట్లాడవేం?" ముత్యాలరావు రెట్టించాడు.

"ఏం మాట్లాడాలి?" అంది శైలజ.

"తెగించావా అనడిగాను. ఆ ప్రశ్నకు బదులివ్వాలి."

"అయ్యో—ఆ ప్రశ్న మీరడిగారా—ఇంకా నేనే అడిగానేమో మీరు బదులు చెబుతారేమోనని యెదురు చూస్తున్నాను...." అంది శైలజ.

ముత్యాలరావుకు ఇంతా అంతా అనరాని కోపం వచ్చింది. పళ్ళ బిగువున దాన్ని అణుచుకుని—"కాలక్షేపానికి ఏ పక్కింటి అమ్మాయినో రమ్మనొచ్చుగా—" అన్నాడు.

"అలా అడక్కపోవడానికి రెండు కారణాలున్నాయి—" అంది శైలజ.

ముత్యాలరావు వినడానికి సిద్ధంగా ఉన్నాడు. మాటల్లో భార్య చాలా తెలివైనదని అతడికి తెలుసు. అందువల్ల అతడికి కాస్త భయంగా కూడా ఉన్నది.

"మనింటికి మంచి పేరు లేదు. అర్ధరాత్రిపూట ఆడపిల్లల్ని ఎవ్వరూ మనింటికి పంపరు—అది మొదటి కారణం—" అంది శైలజ.

"రెండో కారణం కూడా చెప్పు. విని సంతోషిస్తాను...." వెటకారంగా అనాలనుకున్నప్పటికీ కాస్త

ఇబ్బందిగానే అతడామాట అన్నాడు.

"మీరు ఓ బిచ్చగాడిని ఉదయం కాలితో తన్నారు. అదే బిచ్చగాడికి నా ప్రాపకం లభించగానే రెండు చేతులూ జోడించి నమస్తే చెప్పారు. ఎంతటి సామాన్యుడికైనా సమాజంలో ఎటువంటి స్థానం కల్పించగలనో తెలుసుకుంటారని ఈ పని చేశాను...." అంది శైలజ.

"అంటే వాడు...." ముత్యాలరావుకి నోట మాట రాలేదు.

"వాడి సంగతి తర్వాత .... ముందు మీ సంగతి ఆలోచించండి...."

3

ఏడాది క్రితం—

పరీక్ష ఫీజు కట్టడానికి ముత్యాలరావు వద్ద డబ్బు లేదు. అన్నేళ్ళ చదువూ వృధా పోతుందని అతడికి బెంగగా వుంది. ఆ సమయంలో అతణ్ని శైలజ కలుసుకుంది. ఫీజు తను కట్టింది.

"కృతజ్ఞతతో మీకు నేను కట్టుబడి పోయాను—" అన్నాడతను.

"కృతజ్ఞత అనకుండా మరో పేరు ఆలోచించండి-" అంది శైలజ.

అప్పటికే వారిద్దరి మధ్యా కొంత ప్రేమ ఏర్పడి ఉన్నది. అది ప్రేమ అని ఇద్దరికీ తెలియదు.

ముత్యాలరావు మంచి వక్త. అతడి ఉపన్యాసాల్లోని ఆదర్శాలు విని ముగ్ధురాలైంది శైలజ. తనకు తెలియకుండానే అతణ్ని అభిమానించసాగింది. ఆమె మొదటిసారి కలుసుకుని మాట్లాడినప్పుడు ముత్యాలరావు వివరాలు

సేకరించాడు. అంతసులో ఆమె తనకు అందనిదని గ్రహించి చాలా దూరంగా వున్నాడు. కాలేజీ ఫీజు కట్టేక వారి చనువు పెరిగింది. చివరికది వివాహానికి దారి తీసింది.

శైలజ తండ్రి ఈ వివాహాన్ని వ్యతిరేకించాడు. శైలజ మొండి పట్టు పట్టింది.

ఆఖరికి ముత్యాల్రావుకో మంచి ఉద్యోగంతో పాటు శైలజ దొరికింది. శైలజకు తండ్రి అయిదు లక్షలిచ్చాడు.

ముత్యాల్రావు దశ మారిపోయింది. దానితో పాటే అతడి బుద్ధీ మారిపోయింది.

* * *

"ఆ బిచ్చగాడి సంగతి తర్వాత.... ముందు మీ సంగతి ఆలోచించుకోండి...."

శైలజ అన్న మాటలు ముత్యాల్రావు చెవుల్లో గింగురుమంటున్నాయి. శైలజ తన భార్య. ఆమె తనను ఎంత మాటన్నది?

శైలజ అండ తనకు లేకపోయి ఉన్నట్లయితే తనూ గుర్తింపులేని బికారిగా తిరుగుతూండేవాడు. ఆ బిచ్చగాడికి మంచి వేషం వేసేసరికి తనకంటే డాబుగా తయారయ్యాడు.

ఉదయం తనన్నాడు—"భర్త పూర్తిగా నీ చెప్పు చేతల్లో ఉండాలనుకుంటే ఆ బిచ్చగాడిని చేసుకోవలసింది—" అని.

ఆ బిచ్చగాణ్ని తను చేసుకుంటే యెలా ఉంటాడో శైలజ చేతల్లో చూపించింది.

తెల్లవారుఝాముదాకా ముత్యాల్రావుకి నిద్రపట్టలేదు. అప్పుడు మాత్రం గాఢంగా నిద్రపట్టింది. టైము ఎనిమిది

దాటేక శైలజ అతణ్ని లేపింది.

అతడు ఉలిక్కిపడి లేచి టైము చూసుకున్నాడు.

"రాత్రి మీకు సరిగ్గా నిద్రపట్టలేదా?" అంది శైలజ.

అతడు ముందు ఉలిక్కిపడ్డాడు. ఆపైన తడబడ్డాడు. జవాబు మాత్రం ఇవ్వలేదు.

"నేను మిమ్మల్ని ఇంకా ప్రేమిస్తున్నాను. అభిమానిస్తున్నాను. గౌరవిస్తున్నాను. అది నా అసమర్థత కాదు. ఆ విషయం గుర్తుంచుకోండి. నా సహనానికి పరీక్షను పెట్టకండి—" అంది శైలజ.

ముత్యాలరావు ఆలోచిస్తున్నాడు. శైలజ అందమైన యువతి. ధనికురాలు. తనను ప్రేమించింది. ఇంకా ప్రేమిస్తానంటోంది. ఆమెను తానెందుకు అలక్ష్యం చేస్తున్నాడు? ఆమె మనసు కష్టపెట్టాలని తానెందుకనుకుంటున్నాడు?

అతడికి బాబూరావు గుర్తుకొచ్చాడు.

4

ఆ రోజు ముత్యాలరావు ఆఫీసుకు వెళ్ళలేదు. బాబూరావింటికి వెళ్ళాడు. సాయంత్రం నాలుగింటి వరకూ బాబూరావు ఇంటివద్దనే ఉంటాడు. అతడు బ్రహ్మచారి. అయితే ఆడవాళ్ళ గురించి అతడికి వివాహిత పురుషుల కంటె చాలా ఎక్కువ తెలుసునని అనుభవ పూర్వకంగా ముత్యాలరావు తెలుసుకున్నాడు.

ముత్యాలరావు వెళ్ళేసరికి బాబూరావు ఇంట్లోనే ఉన్నాడు. గది తలుపులు సగం తెరిచి ఉన్నాయి. గది ఊడుస్తున్న పనిమనిషితో అతడు సరసాలాడుతున్నాడు. సిగ్గుపడుతూనే ఆ పిల్ల పనిచేసుకుని పోతున్నది. ముత్యా

ప్రావును చూస్తూనే — "రా — రా — కూర్చో—" అన్నాడు బాబూరావు.

ముత్యాల్రావు వెళ్ళి కూర్చున్నాడు.

"ఏమిటి విశేషం — ఈ సమయంలో వచ్చావ్!" అన్నాడు బాబూరావు.

"నీ సలహా కావాలి—అర్జంటుగా—" అన్నాడు ముత్యాల్రావు.

"దేనికి?" అనడిగాడు బాబూరావు.

ముత్యాల్రావు జరిగింది చెప్పి — "ఇప్పుడు నేనేం చేయాలి? నాకు తప్పు చేశానన్న అనుభూతి కలుగుతున్నది—" అన్నాడు.

బాబూరావు నవ్వాడు—"నీ భార్యకేదో అన్యాయం చేశానని నువ్వు అనుకుంటున్నావు. కానీ రీటా గురించి నువ్వాలోచించడం లేదు. నీ భార్యకు వచ్చిన లోటేమిటి? సమాజంలో గౌరవస్థానమున్నది. ఆమె బిడ్డలకు రక్షణ ఉన్నది. రీటాకు అటువంటివేమీ లేవు. కొందరు మగవాళ్ళ సుఖం కోసం ఆమె తన జీవితాన్నే త్యాగం చేస్తున్నది. అయినా ఆమె నీ ఆలోచనల్లోకి రాలేదు. మన సమాజపు తీరే అంత! త్యాగమూర్తుల్ని గుర్తించదు. స్వార్థపరులకు హారతి పడుతుంది—"

"నన్ను పెళ్ళి చేసుకోవడం ద్వారా నా భార్య మాత్రం త్యాగం చెయ్యలేదా?" అన్నాడు ముత్యాల్రావు.

"అని నేననుకోను. అయిదులక్షలు కూడా తీసుకురాగలిగిన ఆడదానికి నీకంటె మంచి మొగుడు దొరకలేదంటే అందుకు కారణమేదైనా ఉండదా? ఆమె వలవేసి నీ వంటి అమాయకుణ్ణి ఒకణ్ణి పట్టింది—"

ముత్యాల్రావు ఆవేశపడుతూ—"నా భార్య గురించి తప్పుడు మాటలు అనవద్దు. నేను సహించలేను—" అన్నాడు.

"నేనేమీ అనడంలేదు. ఆలోచించమంటున్నాను. నీ స్థానంలో నేనుంటే ఏంచేసేవాడినో చెప్పమంటావా?" అన్నాడు బాబూరావు.

"ఊఁ."

"మన పూర్వీకులు చాలా తెలివైనవారు. ఆడదానికి మగవాడు మినహాయించి మరో రక్షణ ఉండకూడదన్నారు. ఆస్తికి, అధికారానికి అనర్హురాలన్నారు. ఎందుకు? డబ్బు, అధికారం చేతిలో ఉంటే ఆడది నైతికంగా పతనమవుతుంది. అందుకేమాత్రమూ సందేహం లేదు. నా భార్య కనుక అయిదు లక్షలతో వస్తే ముందు ఆ డబ్బును నా పేరుకు మార్చుకుంటాను. ఆ తర్వాత ఒక సంవత్సరంలోగా ఆమెను ఫినిష్ చేస్తాను. రీటాలాంటి వాళ్ళను వెతుక్కుని హాయిగా కాలం గడుపుతాను—"

ముత్యాల్రావు ఆలోచనల్లో పడ్డాడు.

"ఏమిటాలోచిస్తున్నావ్?" అన్నాడు బాబూరావు.

"ఫినిష్ చేయడం అంత సులభమా!" అన్నాడు ముత్యాల్రావు.

"ఎంత సులభమో చెబుతాను...." అంటూ బాబూరావు లేచి గదిలోని బీరువా ఒకటి తెరచి ఓ చిన్న సీసా తీశాడు.

"ఇందులో చిన్న మాత్రలు వందకుపైగా వున్నాయి. వారానికి రెండు చొప్పున ఇవి తీసుకుంటే ఏడాది తిరక్కుండా చచ్చిపోవచ్చు. ఇది స్లో పాయిజన్. ఇది తీసుకుంటూండగా మధ్యలో డాక్టరు వద్దకు వెళ్లేటంత

సీరియస్ కంప్లయింట్సూ ఉండవు. ఉన్నట్లుండి ఓ రోజున ప్రాణం పోతుంది...."

"నిజంగా?" అన్నాడు ముత్యాలరావు ఆశ్చర్యంగా.

"దీని ఖరీదు ఇరవై వేలు. ఒక్కసారిగా ఈయనవల సరంలేదు. వాయిదా పద్ధతులలో తీర్చుకోనవచ్చును. నోటు రాసిచ్చి చెల్లువేసుకుంటే చాలు...." అన్నాడు బాబూరావు.

"సరే—అయితే ఆ సీసా ఇలా ఇవ్వు...." అన్నాడు ముత్యాలరావు.

5

"అరే—ఈ రోజు పన్నెండింటికే వచ్చేశారే..." అంది శైలజ.

ఆమె కిషోర్‌ని వెళ్ళిపొమ్మంది. కానీ ముత్యాలరావు ఆగమన్నాడు. కిషోర్ అతడివంక ప్రశ్నార్థకంగా చూశాడు.

"రోజూ—మా యింట్లో ఎందుకుంటావ్?" అన్నాడు ముత్యాలరావు తీవ్రంగా. కిషోర్ ఏదో బదులిచ్చేలోగా-"ఈ యింటికి నేను యజమానిని. నా అనుమతి లేనిదే నువ్వీ యింట్లో అడుగుపెట్టడానికి లేదు. ఇంకెప్పుడూ ఇలా రాకు—" అన్నాడు మళ్ళీ.

కిషోర్ మాట్లాడకుండా వెనుదిరిగాడు. ముత్యాలరావు అతడిని వెనుకనుంచి ఫెడీమని తన్నాడు. ఊహించని ఈ దెబ్బకు కిషోర్ బోర్లాపడిపోయాడు.

శైలజ కూడా ఇది ఊహించినట్లు లేదు. ఆమె ప్రమాన్పడి ఈ దృశ్యాన్ని చూస్తోంది. ముత్యాలరావు భార్యవంక తిరిగి—"నువ్వు ఎలాంటి మనిషిని ఎలాంటి స్థాయికి తెచ్చినా నా దృష్టిలో వాడి విలువ పెరుగదు"

అన్నాడు.

కిషోర్ నెమ్మదిగా లేచాడు. అతడి పెదాలు చిట్లినట్లున్నాయి. కొద్దిగా రక్తం కనబడుతున్నది.

ముత్యాలరావు అతడి వంక రూపాయనోటు తీసి ఆడించాడు.

కిషోర్ అతణ్ని సమీపించాడు. ఆ రూపాయనోటు అందుకున్నాడు. ఓసారి ముత్యాలరావు కళ్ళలోకి చూశాడు. తర్వాత ఉన్నట్టుండి ముత్యాలరావు చెంప ఛెళ్ళుమనిపించాడు.

ఇలా జరుగుతుందని ముత్యాలరావు ఏ మాత్రమూ ఊహించినట్లు లేదు.

కిషోర్ శైలజ వంక తిరిగి — "శైలజగారూ! నా తరఫున మీరతడికి అయిదు రూపాయలివ్వండి—" అని చరచరా వెళ్ళిపోయాడు.

ముత్యాలరావు కొద్దిక్షణాలలాగే ఉండిపోయాడు.

"చూశారా—వాడే సాయికి ఎదిగాడో!" అంది శైలజ.

"వాడు నన్నెందుకు కొట్టాడో తెలుసా?" అన్నాడు ముత్యాలరావు చెంప తడుముకుంటూ.

"తెలుసు...." అంది శైలజ.

"నువ్వనుకుంటున్న కారణం సరైనది కాదు. నీకు డబ్బుంది. నాకు లేదు. అందుకే వాడు నీ ఆదేశంమీద నన్ను కొట్టాడు ..."

"డబ్బున్నది నాకేననీ—మీకాదనీ నిజంగా మీరనుకునే పక్షంలో నా డబ్బును మంచినీళ్ళలా ఖర్చు పెట్టరు—" అంది శైలజ.

"అంటే?" అన్నాడు ముత్యాలరావు.

శైలజ చటుక్కున అతడి చేతిలో అయిదు రూపాయలు పెట్టి—"ఇకమీదట మీరు డబ్బు ఇలాగే సంపాదించుకోండి—" అని వెళ్ళిపోయింది. ముత్యాలరావు మళ్ళీ దెబ్బతిన్నాడు.

శైలజ తన భార్య....ఆమె తనను ఎంతమాటన్నది?

అతడికి ఆవేశంతో శరీరం వణికింది. శైలజను అప్పటికప్పుడు నరికిపోగులు పెట్టాలన్న ఆలోచన కలిగింది.

ముత్యాలరావు ఆవేశాన్ని అణుచుకున్నాడు.

శైలజ బాత్రూముకు వెళ్ళింది. అతను బెడ్రూంలోకి దారితీశాడు. అక్కడ గ్లాసు గ్లాసులో నీళ్ళు. రోజూ రాత్రి శైలజ మంచినీళ్ళు తాగుతుంది. ఈ రోజింకా తాగలేదన్నమాట! ముత్యాలరావు చప్పున తన జేబులోని సీసాలోని మాత్రలు రెండు ఆ నీళ్ళలో వేశాడు. వెంటనే కరిగిపోయాయవి.

అతడు వెళ్ళి మంచంమీద పడుకున్నాడు. కొద్ది క్షణాల్లో శైలజ పడకగదిలోనికి వచ్చింది. వస్తూనే అతణ్ని సమీపించింది. అతడు కళ్ళు మూసుకుని వున్నాడు.

"మీరు నిద్రపోవడం లేదని నాకు తెలుసు—" అన్నదామె.

ముత్యాలరావు మాట్లాడలేదు.

"కోపం వచ్చిందా?" అన్నదామె. అతడు మాట్లాడకపోగా నుదుటిమీద చేయివేసి—"మీ మీద నాకూ కోపంగానే ఉంది. అందుకు కారణం మాత్రం ప్రేమ" అన్నది.

ముత్యాలరావు చప్పున కళ్ళు తెరిచాడు—"నీకు నా మీద ప్రేమలేదు. ప్రేమ ఉంటే ఆస్తంతా నీ పేరున ఉంచుకోవు—" అన్నాడు.

"ఆస్తి నా పేరున వున్నా అనుభవం మీదే! నా తదనంతరం నా ఆస్తి మీకే చెందుతుంది. ఆ విధంగా మీకు నన్ను హత్యచేసే అవకాశం కూడా ఇస్తున్నాను. ఇంకా ఏం కావాలి?" అంది శైలజ.

ముత్యాలరావు ఉలిక్కిపడి—"అయితే నేను నిన్ను హత్య చేస్తానని అనుమానిస్తున్నావా?" అన్నాడు.

"అలా చేసినా బాగుండును. అప్పుడిలా రోజూ చావాల్సిన అవసరముండదు—" అని శైలజ కళ్ళు తుడుచుకుంది.

ముత్యాలరావు నెమ్మదిగా — "నీకు చచ్చిపోవాలనుందా?" అనడిగాడు.

"నా విషయంలో మీరు తీర్చగల కోరిక అదొక్కటే నని నాకు తెలుసు. అదొక్కటిమాత్రం మిమ్మల్ని అడగను...." అంది శైలజ.

'అడక్కుండా నే నీ కోరిక తీర్చగలనులే—' అనుకున్నాడు ముత్యాలరావు.

ఉదయం లేచేసరికి అక్కడ గ్లాసులో నీళ్ళు లేవు. ఎందుకో ముత్యాలరావు శరీరం వణికింది.

ఆఫీసుకు వెడుతూ ముత్యాలరావు భార్యతో—"ఈ రోజు రీటాను ఇంటికి తీసుకుని వస్తాను...." అన్నాడు.

శైలజ తెల్లబోయి భర్త వంక చూసింది.

"ఈ కిషోర్ వ్యవహారం నాకు నచ్చలేదు. అందుకని...."

"మీరు తప్పు నామీదకు నెట్టాలని చూస్తున్నారు. అసలు మీరు రీటాతో తిరగాల్సిన అవసరమేమిటో చెప్పండి...."

"రీటా నేను చెప్పినట్లు వింటుంది. నువ్వు నా మాట

వినవు. నాకంటే డబ్బెక్కువున్నదన్న గర్వం నీకుంది."

"నాకు గర్వంలేదు...."

"అది నేను నమ్మాలంటే నువ్వా అయిదు లక్షలూ వదులుకోవాలి. అప్పుడు నేను నీకంటే అ స్తిపరుణ్నవు తాను...."

"అంతేనా మీకాక్కావలసింది...."

"ఎస్...అప్పుడు రీటా ఈ యింటి గడపతొక్కదు."

"మీరూ రీటా యింటి గడప తొక్కకూడదు ..."

ముత్యాల్రావు కొద్ది క్షణాలు ఆలోచించి-"ఓ. కే-" అన్నాడు.

"నేను మిమ్మల్ని నమ్ముతున్నాను. మీరీరోజు రాత్రికి పెందరాళే యింటికి రండి—" అంది శైలజ.

"రాత్రికి కాదు. సాయంత్రానికే వచ్చేస్తాను. ఈ రోజు క్లబ్బుకు కూడా వెళ్ళను...." అన్నాడు ముత్యా ల్రావు.

6

"ఆరే—ఈ రోజు పగలు వచ్చారేమిటి?" అంది రీటా.

"రాత్రికి పెందరాళే వస్తానని నా భార్యకు మాటి చ్చాను...."

"భార్యకు మాట ఇవ్వడమూ—అది నిలబెట్టుకోవా లనుకోవడమూ— . అంటే మీలో రాకూడని మార్పు వచ్చినట్లే లెక్క!" అంది రీటా.

"ఈ మార్పువల్ల నాకు అయిదు లక్షలు లాభం—" అంటూ ముత్యాల్రావు జరిగినదామెకు చెప్పాడు. స్లో పాయిజన్ గురించి మాత్రం చెప్పలేదు.

"నిజంగా—" అంటూ బలంగా కౌగలించుకుందామె

అతణ్ని.

"నీతో అబద్ధం చెబుతానా?" అన్నాడతను.

"అయితే ఎల్లుండికి నాకు రత్నాల నెక్లెస్ కావాలి." అంది రీటా.

"చూద్దాం—"

"అదేమిటి—రాజకీయ నాయకుల్లాగ...."

"డబ్బున్నది కదా — ఇంకా నేను రాజకీయాల గురించి కూడా ఆలోచించాలి...."

"మీరు రాజకీయాల గురించి ఆలోచించవద్దు. అప్పుడు నన్ను అలక్ష్యం చేస్తారు. మన మెప్పుడూ ఇలాగే ఉండాలి—" అంది రీటా.

"చూద్దాం—" అన్నాడు ముత్యాల్రావు.

"అదిగో—మళ్ళీ చూద్దాం అంటున్నారు—" అంది రీటా.

"నువ్వంటే ఎంత మోజు లేకపోతే నేను ఇలా పగలు నీకోసం వస్తానో చెప్పు—" అన్నాడు ముత్యాల్రావు.

రీటా మరి మాట్లాడలేదు.

ముత్యాల్రావు తిన్నగా రీటా యింటినుంచి ఇంటికి వెళ్ళాడు. శైలజ అతణ్ని చూసి ఆశ్చర్యపడుతూ—"అరే—అన్న ప్రకారం వచ్చేశారే—" అంది. అతడి వెంట రీటా లేకపోవడం ఆమెకు ఎంతో సంతోషంగా ఉన్నది.

"ఇంక నువ్వు నీ మాట నిలబెట్టుకోవాలి—" అన్నాడు ముత్యాల్రావు.

"నా మాట నేనూ నిలబెట్టుకున్నాను—" అంది శైలజ.

"మరి — నాకు కబురు పెట్టలేదేం?" అన్నాడు

ముత్యాల్రావు.

"మీకు కబురెందుకు?" ఆశ్చర్యంగా అడిగింది శైలజ.

"బాగుంది—డిపాజిట్ నా పేరున మార్చినపుడు నా సంతకాలు అవసరపడతాయికదా—" అన్నాడు ముత్యాల్రావు.

"పేవలాగనుకో లేదు—" అంది శైలజ.

"మరి— ...."

"మీరు కోరిన దేమిటి? నేను మీకంటె ఎక్కువ ఆస్తిని కలిగివుండరాదని .... అందుకని ..."

"అందుకని...." కంగారుగా అడిగాడు ముత్యాల్రావు.

"ఆ అయిదు లక్షలూ కిషోర్ కిచ్చేశాను..."

"ఆఁ" ఉలిక్కిపడి నోరు తెరిచాడు ముత్యాల్రావు.

"నేను మీ నీడలో బ్రతకాలనుకుంటున్నాను. మీరు నాకు నీడ ఇవ్వాలనుకుంటున్నారు. నా డబ్బు మిమ్మల్ని విలాస జీవితంవైపు దృష్టి మళ్ళించింది. అలాంటప్పుడా డబ్బు నాకు ఉండకపోవడమే మంచిదనిపించింది. ఈ రోజు కాకపోయినా మరో రోజైనా నేను చేసిన పనికి మీరు మారిస్తారు. మనం మనంగా బ్రతకడం కోసం నే నీ నిర్ణయానికి వచ్చాను...." అంది శైలజ.

"ఎందుకు చేశా వీ పని?"

"మన సుఖం కోసం...."

శైలజ చెంప ఛెళ్ళుమంది.

"ఇప్పుడు సుఖంగా వుందా?"

శైలజ ఏదో అనబోయింది. మళ్ళీ ఆమె చెంప ఛెళ్ళుమంది.

"ఎవడా కిషోర్? వాడికి నువ్వు అయిదులక్షలెందు

కిచ్చావ్? ఏదో నాటకమాడుతున్నావు.... చెప్పు...."

శైలజ ఏదో చెప్పబోతోంది. కానీ అతడు జవాబు కోసం ప్రశ్నలడగడంలేదు. అయిదు లక్షల రూపాయలు ఆనామకుడికి పోయాయన్న కడుపు మంట అతడిలో ఇంతా అంతా అనలేని ఆవేశాన్ని కలిగించింది. అత. డామెను చావగొడుతున్నాడు. కాసేపు ఆమె మౌనంగా భరించింది. చివరకు అరవడానికి సిద్ధపడింది. అరవకుండా అతడామె గొంతు పట్టుకున్నాడు.

ఆవేశంలో అతడి చేతులు ఆమె గొంతుచుట్టూ బిగుసుకుంటున్నాయి. అతడినుంచి విడిపించుకోనడాని కామెకు బలం చాలలేదు.

కొద్ది క్షణాల్లోనే ఆమె నిర్జీవంగా తలవాల్చేసింది. అప్పుడు ముత్యాల్రావు ఆవేశమూ తగ్గింది.

ముత్యాల్రావు పట్టు సడలింది. శైలజ నేల కూలింది.

అతడు మామూలు మనిషయ్యాడు. చటుక్కున ఆమె మీదకు వంగి—"శైలూ!" అన్నాడు.

శైలజ కదలలేదు.

ముత్యాల్రావుకి అనుమానం వచ్చింది. అతడామె నాడి, శ్వాస పరీక్షించాడు. ఆమె చనిపోయినట్లు గ్రహించడానికతడి కంతో సేపు పట్టలేదు.

"శైలజ చచ్చిపోయింది...." అన్న భావన అతణ్ని ఆపాదమస్తకమూ కదిలించింది.

శైలజ ఎలా చచ్చిపోయింది?....తనే చంపేశాడు... తను....తను హంతకుడు....

బాబూరావు తనకు సలహా యిచ్చాడు. ఓ పాడు స్లో పాయిజన్ కూడా ఇచ్చాడు, ఎవరూ అనుమానించని పద్ధతిలో శైలజను చంపవచ్చునని! కానీ తను అంతకాలం

ఆగలేక పోయాడు. ఆవేశపడి చేజేతులా ఆమెను చంపేశాడు.

7

ముత్యాల్రావు దొంగ కాదు. రౌడీ కాదు. గూండా కాదు. నడమంత్రపు సిరి పట్టిన ఓ సామాన్యుడు. తను హత్య చేశానన్న నిజాన్ని అతడు జీర్ణించుకోలేకుండా ఉన్నాడు.

ఇప్పుడేం చేయాలి?

అతడికి బాబూరావే గుర్తొచ్చాడు. వెంటనే ముత్యాల్రావు లేచి — శైలజను ఎత్తి మంచంమీద పడుకోబెట్టాడు. తలుపులు దగ్గరగా వేసి బైటకు వచ్చాడు. ముందు ఇంటికి తాళం వేయాలనుకున్నాడు. శైలజ ఇంట్లో వుండగా తను తాళం వేయడం ఇరుగు పొరుగు లెవరైనా చూస్తే బాగుండదు. సాధారణంగా ఈ సమయంలో ఇరుగుపొరుగు లెవరూ ఇంటికి రారు. అందుకని తాళం వేయకూడదనే అతడు నిశ్చయించుకున్నాడు.

అతడు బాబూరావు ఇల్లు చేరాడు. బాబూరావు ఇంటి తలుపులు సాధారణంగా తెరిచే ఉంటాయి. ఆ రోజవి ఓరవాకిలిగా వేసి ఉన్నాయి. లోపల్నుంచి బాబూరావు మాట వినబడుతోంది. అతడు ఫోన్లో మాట్లాడుతున్నాడు ఎవరితోనో!

“హలో! రేపటికి అన్న ప్రకారం పదివేలూ కట్టి తీరాల్సిందే... ఒక్క క్షణం కూడా ఆలస్యం జరగడానికి వీల్లేదు.... నేను రీటాను ప్రయోగించి నిన్ను మోసగించానంటావా? ... నిన్నెవడు మోసపొమ్మన్నాడు? ....

నేను వెళ్ళి గంగలో దూకమంటాను.... దూకతావా?.... నీ సుఖం కోసం నువ్వు తప్పుచేసి ఆపైన నన్ను తప్పు పట్టడ మెందుకు? .... నీ రహస్యం దాచడానికి అన్న ప్రకారం రేపు పదివేలూ ఇచ్చేయాల్సిందే—ఈ విషయమై మరి మాట్లేవు. ఫోన్ పెట్టేస్తున్నాను...."

బాబూరావు ఫోన్ పెట్టేసేలోగా ముత్యాలరావు వెనుదిరిగాడు.

బాబూరావు బ్లాక్ మెయిలర్! ఈ విషయం తనకు తెలుసు. తన కతడు ఎన్నోసార్లు సగర్వంగా చెప్పు కున్నాడు కూడా!

"ప్రతి మనిషికీ కొన్ని రహస్యాలుంటాయి. అవి మనం తెలుసుకోవాలి. రహస్యాలు లేనివాళ్ళుంటారనుకో. అప్పుడు మనం సృష్టించాలి. ఆ తర్వాతనుంచి ఆ రహ స్యాలే మనకు కనక వర్షం కురిపిస్తాయి. ఈ రహస్యం నువ్వు గుర్తుంచుకో—" అని బాబూరావు తొలి పరిచ యంలో ముత్యాలరావుకి చెప్పుకున్నాడు.

బాబూరావు బ్లాక్ మెయిలర్. తను హంతకుడన్న విషయం అతడికి తెలిస్తే—తప్పకుండా బ్లాక్ మెయిలింగ్ ప్రారంభిస్తాడు బాబూరావు. తన్ను బికారిని చేస్తాడు. ఈ విషయం ఇంకెవ్వరికీ తెలియనివ్వకూడదు. ఈ రహ స్యం తనలోనే ఉండిపోవాలి....

ముత్యాలరావు బుర్రలో పథకం మెరుస్తోంది.

తనిప్పుడు శవాన్ని మాయం చెయ్యాలి. ఆ తర్వాత సెలవుమీద ఊరు వదిలిపెట్టాలి. తిరుగుదారిలో ముత్యా లరావు పోస్టాఫీసువద్ద ఆగాడు. అది అన్నివేళలా పనిచేసే పోస్టాఫీసు.

ముత్యాల్రావు ఇన్‌లాండ్ లెటర్ కొన్నాడు. మామ గారికి ఉత్తరం వ్రాశాడు.

"పూజ్యనీయులగు మామగార్కి నమస్కారములు

అనుకోకుండా నేను ఊరు వదిలి వెడుతు న్నాను. మీ అమ్మాయి తానొక్కర్తీ ఉండ లేనన్నది. అందుకని ఈ రోజు రాత్రి ట్రయిన్‌కు మీ యింటికి బయల్దేరి వస్తుంది.

నేను తిరిగి ఎప్పుడు వచ్చేదీ సరిగ్గా తెలియదు. బహుశా నెలరోజులు పట్టవచ్చును. రాగానే మీకు ఉత్తరం వ్రాస్తాను. విషయం తెలియబర్చడం కోసం ఈ ఉత్తరం వ్రాస్తున్నాను. అత్తయ్య గార్కి నమస్కారము లందజేయండి. అందర్నీ అడిగినట్లు చెప్పండి.

మీ అల్లుడు

ముత్యాల్రావు—"

అడ్రసు వ్రాసి ఉత్తరం పోస్టుచేశాడు.

ఈ ఉత్తరం కారణంగా ఆమె గురించి తనకింకేమీ తెలియనట్లే అంతా భావిస్తారు. తను ఆమె శవాన్ని ముక్కలుచేసి కూడా తీసుకుని వెళ్ళి వివిధ ప్రాంతాల్లో పారేస్తాడు.

ఈ ఆలోచనలు ముత్యాల్రావుని వణికింపజేస్తున్నాయి. అడుగు పడడం కష్టంగా ఉన్నదతడికి. ఆ విధంగా ఇల్లు చేరేసరికి ఆలస్యమయింది.

తలుపులతడెలా వేశాడో అలాగే ఉన్నాయి. ఇరుగు పొరుగుల్లో హడావుడి ఏమీ లేదు. అంటే ఎవరికీ ఇంత వరకూ ఏమీ తెలియలేదన్నమాట! ముత్యాల్రావు తేలికగా నిట్టూర్చాడు.

తనిప్పుడేం చేయాలి?

ముందు శవాన్ని ముక్కలు చేయాలి. అందుకు కత్తినో కత్తిపీటనో ఉపయోగించాలి. ఈ ఆలోచనకు అతడి అణువణువూ వణికింది. కానీ తప్పుచేశాక ధైర్యం వహించక తప్పదు.

వంటింట్లో పనసకాయ కత్తి ఒకటి మంచి పదును మీద ఉన్నది. ఆ కత్తి పొరుషంకొద్దీ శైలజ కొన్నది. పనసకాయ కొని—కొట్టించడం కోసం పొరుగింట్లో అడిగిందామె. అప్పుడు పొరుగింటావిడ — "మావద్ద కత్తి ఉన్నది. కానీ ఎరువు ఇవ్వం—" అని ఖచ్చితంగా చెప్పేసింది. పంతంవచ్చి శైలజ అప్పటికప్పుడు బజార్నించి కత్తిని తెప్పించింది.

ఆ రోజు పనసకాయ.... ఈ రోజు శైలజ.

8

ముత్యాలరావు వంటింట్లోకి నడిచాడు. ఆ కత్తి ఎక్కడ ఉన్నదీ అతడికి తెలుసు. అటే నడిచాడు.

నాలుగడుగులు అటు వేశాడో లేదో ముత్యాలరావు కళ్ళు పెద్దవయ్యాయి. ఎదురుగా గోడకు ఆనుకుని శైలజ నిలబడి ఉన్నది.

ముత్యాలరావు అరవబోయాడు. కానీ తమాయించుకున్నాడు. ఆమె శైలజ కాదు. అది శవం! కళ్ళు తెరిచి వున్నాయి. రెప్ప వాలడంలేదు.

అయితే ఆ శవం బెడ్రూంలో ఉండాలి. ఇక్కడకెలా వచ్చింది? శవం నడిచి వచ్చిందా—.... లేక ....

ముత్యాలరావు ఒక్క పరుగున బెడ్రూంలోకి వెళ్లాడు. బెడ్రూంలో శైలజ శవంలేదు. అతడికి ముచ్చెమట్లు పోశాయి.

ఎలా జరిగింది విచిత్రం?

శైలజ చనిపోలేదా?

కానీ .... తనామెను పీకపిసికి చంపినమాట నిజం. ఆమె చనిపోయిన మాట కూడా నిజం. వంటింట్లో నిలబడి ఉన్న శైలజ శవంలా ఉన్నది తప్పితే జీవంలేదు. మరి.... ఆ శవం ఇక్కణ్నించి అక్కడకు ఎలా వెళ్ళింది?

ముత్యాలరావుకు భయంతో చెమటలు ధారాపాతంగా కారసాగాయి. అతడు మళ్ళీ వంటింటివైపు నడిచాడు. కానీ సగం నడిచేక అతడికి భయం వేసింది. శైలజ శవాన్ని చూడాలంటేనే అతడికి భయంగా ఉన్నది. అతడి మనసు కీడును శంకిస్తున్నది.

ముత్యాలరావు ముందు బాత్రూంలోకి వెళ్ళి రావా లనుకున్నాడు.

అప్రయత్నంగానే అతడు బాత్రూంలో ప్రవేశించాడు.

ఎదురుగా గోడకు ఆనుకుని శైలజ శవం!

కెవ్వుమన్నాడు ముత్యాలరావు. అలా అరిచేక తన కేక ఎవరైనా వింటారేమోనని భయం వేసింది. చటుక్కున వీధిలోకి వెళ్ళి చూశాడు. యెవ్వరూ లేరు.

ఓసారి తేలికగా నిట్టూర్చాడు.

ఏమిటీ విచిత్రం? శవం ఇల్లంతా ఎలా తిరుగుతోంది? శైలజ చచ్చికూడా తన్ను సాధించదల్చుకుందా?

ముత్యాలరావు మళ్ళీ బాత్రూంలోకి వచ్చాడు. ఈ పర్యాయం అతడికక్కడ శైలజ కనబడలేదు. తడబడుతూనే అతడు లోపలకు నడిచాడు. శవం కనబడలేదు.

ఒక్క నిమిషం ప్రశాంతంగా ఆలోచించాలి___అని అనుకున్నాడతను. మళ్ళీ బెడ్రూంలోకి నడిచాడు,

బెడ్రూంలో మంచంమీద వెల్లకిలా పడివున్నది శైలజ శవం. తనెలా పడుకోబెట్టాడో-అలాగే వున్నదా శవం!

'ఇప్పటికి నా మనసు నిమ్మళపడింది—' అనుకున్నాడు ముత్యాల్రావు.

జీవితంలో తొలిసారిగా అదీ అనుకోకుండా హత్య చేశాడతను. ఆ కారణంగా కలిగిన భయంలో మనసు అనేక రకాల భ్రమలకు లోనయింది. అందువల్లనే ఆమె బెడ్రూంలో లేనట్లూ—బాత్రూంలోనూ, వంటింట్లోనూ ఉన్నట్లూ తనకు అనిపించింది.

అదంతా భ్రమ!

అతడు శవాన్ని సమీపించాడు.

శైలజ నిర్జీవంగా పడివున్నది. ఆమె చాలా మంచిది. తనను ప్రేమించింది. కానీ అతన్ని తల్చుకుందు కిప్పుడు టైము లేదు. ఆమె తన్ను ప్రేమించినప్పటికీ, మంచిదే అయినప్పటికీ—తన్ను బాగా రెచ్చగొట్టింది. హత్యకు ప్రోత్సహించింది. అది శైలజ తప్పుకాని పక్షంలో తన వంటి సామాన్యుడు ఒక నిండు ప్రాణం తీయగలడా?

ముత్యాల్రావు ఆమె కను రెప్పల్ని మూయడానికి వంగాడు. సరిగ్గా అప్పుడు అతడి భుజంమీద ఎవరిదో చేయిపడింది.

ఉలిక్కిపడి కెవ్వుమన్నాడు ముత్యాల్రావు. తర్వాత నెమ్మదిగా వెనక్కి తిరిగాడు.

9

"మొత్తానికి నువ్వు నీ భార్యను చంపేశావన్నమాట" అన్నాడు కిషోర్.

"లేదు.... నేను చంపలేదు—...." అన్నాడు ముత్యా

ర్రావు.

"నువ్వు కాకపోతే ఇంకెవరు చంపుతారు?" అన్నాడు కిషోర్.

"నువ్వు. నా భార్య కారణంగా నీకు అయిదు లక్షలు వచ్చింది. యెలాగో మోసంచేసి ఆస్తి నీ పేరుమీదకు మార్పించగలిగావు. ఆ తర్వాత ఆమెవల్ల నీకు ప్రమాదముంటుందనిపించింది చంపేశావు" అన్నాడు ముత్యాలరావు.

"నీ కథనం బాగుంది. కానీ ఋజువుండాలికదా!"

"ఉంది—" అన్నాడు ముత్యాలరావు.

"ఆ ఋజువు ప్రకారం కూడా నువ్వే హంతకుడివౌతావు...."

"ఎలా?"

"నీ భార్య నీ కోరిక ప్రకారం ఈ రోజే మొత్తం ఆస్తినంతా నీ పేరుకు మార్చేసింది. నీ సంతకాలు రేపు తీసుకునే ఏర్పాటు జరిగింది—" అన్నాడు కిషోర్.

"ఏమిటీ?"

"నీ భార్య శైలజ నిన్ను మనసారా ప్రేమించింది. నీకోసం ఏమైనా చేయడానికి సిద్ధపడింది. నువ్వు తన్ను అలక్ష్యం చేస్తూంటే ఆ లోపం తనదే ననుకునేది. నిన్ను లాగైనా తనవాణ్ణి చేసుకోవాలని తాపత్రయపడింది. అందుకు కారణం నువ్వు మహా ప్రేమ. పురుషుడివనీ కాదు, అపూర్వ లక్షణాలున్న వాడివనీ కాదు. జస్ట్ లవ్—అంతే! లవ్వీజ్ బ్లైండ్ అంటారు చూశావా—అదే జరిగిందామె విషయంలో!"

"ఇంతకీ నువ్వెవరు?" అన్నాడు ముత్యాలరావు.

"నేనొక ప్రయివేట్ డిటెక్టివ్ని. ఆమె నీమీద

నిఘా వేయడం కోసం నన్ను రప్పించింది. నీ తప్పులెంచడంకోసం కాదు ఆమె నన్ను నియమించుత! నీ అమాయకత్వాన్ని దుర్మార్గులెవరైనా ఉపయోగించుకుని నిన్ను కష్టాలపాలు చేస్తారేమోనన్న భయంలో! ఆమెకు నీ గురించి అన్నీ తెలుసు—ఆఖరికి నువ్వియ్యబోయిన స్లో పాయిజన్ గురించి కూడా!" అన్నాడు కిషోర్.

ముత్యాల్రావుకు భయంతోనూ ఆశ్చర్యంతోనూ నోట మాటరాలేదు— "నువ్వు .... నువ్వు .... డిటెక్టివువా?" అన్నాడు.

"అవును. నీ భార్య సీత ప్రజ్ఞురాలు. తన సమస్యలకు పరిష్కారం తనే వెతుక్కోవాలనుకుంటుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ ధైర్యాన్ని విడనాడదు. నీ కాళ్ళు పట్టుకుని నిన్ను లొంగదీసుకోవాలనే ఉద్దేశంమామెకు లేదు. అయితే నీ దుర్మార్గత్వాన్ని ఆమె ఎక్కువ అంచనా వేసింది. నువ్వు చాలా మంచివాడివనీ — నేరంచేసే స్వభావం నీకు లేదనీ ఆమె నాకు చెబుతూండేది.

అందువల్లనే ఈ రోజు ఆమె నిన్ను ఆటపట్టించడానికో అబద్ధం చెప్పాలనుకుంటే నేనూ వారించనూ లేదు. ఆమెను నీనుంచి రక్షించాల్సిన అవసరంకోసం నన్ను నియమించలేదు. నిన్ను బాబూరావు రీటాలనుంచి రక్షించడంకోసం నన్ను నియమించింది. అయితే నే నూహించనిది జరిగిపోయింది. నిన్ను ఉరికంబం ఎక్కించినా—నాకు నీ భార్య శైలజను రక్షించలేక పోయానన్న బాధ అలాగే మిగిలిపోతుంది—" అన్నాడు కిషోర్ దిగులుగా.

"ఉరికంబం ....ఉరికంబం ...." అన్నాడు ముత్యాల్రావు...."వీల్లేదు అలా జరగడానికి వీల్లేదు ...."

"నీ మొత్తం నేరాలన్నీ నేను బుజువు చేయగలను,

హత్య చేయడంలో నీ భాగం తెలుసుకోవడంకోసమే నేను శవాన్ని అటూ యిటూ మార్చి నీ ముఖభావాలు పరీక్షించాను. శవాన్ని చూసి నీకు భయం, ఆశ్చర్యం కలిగాయి తప్పితే ఏడుపు రాలేదు. నీ కోసం అన్నీ త్యాగం చేయాలనుకునే భార్య దగ్గర్నుంచి నువ్వు ప్రాణాలు కోరితే—చట్టం చూస్తూ ఊరుకోదు. అదీ నీ ప్రాణాలు కోరుతుంది. పద — పోలీసుస్టేషన్ కు....” అన్నాడు కిషోర్.

“నేను రాను....” అన్నాడు ముత్యాల్రావు.

“ఇంక నువ్వు తప్పించుకోలేవు......” అన్నాడు కిషోర్.

ముత్యాల్రావు ఉన్నట్టుండి తన పిడికిలితో కిషోర్ తలమీద గట్టిగా మోదాడు. కిషోర్ తూలి కిందపడ్డాడు. అతడికి తలంతా దిమ్మెక్కిపోయింది. పడడంలో అతడి తల మంచానికి కొట్టుకుని కొద్దిగా రక్తం వచ్చింది.

ఆ వ్యవధి చాలు ముత్యాల్రావుకి.

కిషోర్ కదలడంలేదు. బహుశా అతడికి స్పృహతప్పి ఉండాలి.

ముత్యాల్రావు పాంటు, షర్టు వేసుకున్నాడు. వంటింట్లోకి వెళ్ళి పనసకాయ కత్తి తీశాడు. దాన్ని జాగ్రత్తగా బొడ్లో దోపాడు. ఇంట్లోంచి బయట పడుతూ మరోసారి బెడ్రూంలోకి తొంగిచూశాడు.

కిషోర్ కదులుతున్నాడు.

తను బయటపడినా ఎలాగూ పట్టుబడక తప్పదని తెలుసు ముత్యాల్రావుకి. తన జీవితం ఎలాగూ నాశనమై పోయింది. కానీ తనవల్ల కావలసిన కార్యం ఒకటి ఉన్నది.

10

ముత్యాల్రావు ఇల్లు పోలీసులతోటీ చుట్టుపక్కల వారితోటీ చాలా హడావుడిగా ఉన్నది. కిషోర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్‌కు జరిగిన కథంతా చెబుతున్నాడు. ఈ కథలో చాలా భాగం ఇరుగుపొరుగులకు తెలియదు.

కిషోర్ కథనం గురించి ఇన్‌స్పెక్టర్ ఆలోచిస్తున్నాడు. కిషోర్ పూర్తిగా నిజం చెబుతున్నాడా అన్న అనుమానం కూడా ఆయనకున్నది. ఆ సమయంలో అక్కడకు ముత్యాల్రావు ప్రవేశించాడు. అతడి చేతిలో రక్తసిక్తమైన కత్తి ఉన్నది.

"హంతకుడు.... హంతకుడు...." కొందరు భయంగా అరిచారు. కొందరు ఆ ప్రాంతంనుంచి పారిపోడానికి ప్రయత్నించారు.

"అవును ఇన్‌స్పెక్టర్ గారూ.... నేను హంతకుణ్ణి...." అంటూ తన చేతిలోని కత్తిని జారవిడిచాడు ముత్యాల్రావు. తన రెండు చేతుల్నీ ముందుకు చాపాడు — అరెస్టు చేయవచ్చునన్నట్లుగా!

క్షణాలమీద ముత్యాల్రావు చేతులకు బేడీలుపడ్డాయి.

"నువ్వు నీ భార్యను ఎందుకు చంపావు?" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"నేను మొత్తం మూడు హత్యలు చేశాను ఇన్‌స్పెక్టర్ గారూ—" అన్నాడు ముత్యాల్రావు.

కిషోర్ ఉలిక్కిపడి — "మూడు హత్యలా?" అన్నాడు.

"అవును. నేను సామాన్యుణ్ని. నన్ను శైలజ ప్రేమించడం నా అదృష్టం. అయితే ఆ అదృష్టాన్ని గుర్తించకుండా ఆమెను స్లో పాయిజన్‌తో చంపాలను

కున్నాను. ఆమె ఎంత ఉన్నతురాలో ఈ రోజే నాకు అర్థమైనాక—అప్పటికే ఆవేశంలో నేనామెను హత్య చేసిన విషయం గుర్తించినాక.... నేనో కొత్త విషయాన్ని కనుగొన్నాను.

బాబూరావు, రీటా మొదట్నించీ స్వప్రయోజనాల కోసం నన్ను నా భార్యకు వ్యతిరేకంగా తయారుచేస్తున్నారు. వాళ్ళు నా మనసుపై స్లో పాయిజన్ లా పని చేశారు. నే నా విష ప్రభావానికి క్రమంగా గురవుతూ వచ్చి ఈ రోజుకు హత్యచేసే స్థితికి చేరుకున్నాను.

నా భార్య నాక్కాకుండా పోవడానికి కారణమైన స్లో పాయిజన్ ను నా మనసులోకి ఎక్కించిన ఆ దుర్మార్గుల బారినుండి కనీసం కొంతమందిని రక్షించడంకోసం— ఇంకో రెండు హత్యలు చేశాను. ఎలాగూ ఓ హత్య చేశానుకదా—ఇవి నాకు కష్టంకాలేదు. మొదటి హత్య చేశాక నా కెంత దిగులు కలిగిందో — ఈ హత్యలు చేశాక అంత సంతృప్తి నన్నావహించింది—ఇంక నాకు ఉరికంబమెక్కుతున్నానన్న బాధలేదు...." అన్నాడు ముత్యాలరావు.

కిషోర్ ముత్యాలరావు మాటల్లోని సారాంశం వెతుకుతున్నాడు. యే డబ్బుకోసం తనామెను చంపాలనుకున్నాడో, ఆ డబ్బు తనకామె ఇచ్చేసిందని తెలియగానే శైలజ ఔన్నత్యం ముత్యాలరావుకి అర్థమయింది. కానీ అంతకుముందే అతడికామె ఔన్నత్యం యెందుకు తెలియలేదు?

—:అయిపోయింది:—